భారీ వర్షాలకు కూలిన ప్రహరీ

పెదగంట్యాడ : జీవీఎంసీ 70వ వార్డు పరిధి చిట్టినాయుడు కాలనీలో ఓ ఇంటి ప్రహరీ మంగళవారం కూలిపోయింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గోడ నానిపోయింది. దీంతో మంగళవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. బంధం రాజు అనే వ్యక్తి భార్య, పిల్లలతో కలిసి చిట్టినాయుడు కాలనీలో నివసిస్తున్నాడు. కూలి పనులు చేస్తూ జీవనం సాగించే రాజు ఇంటి గోడ కూలిపోవడంతో అధికారులు వారిని సురక్షిత ప్రాంతానికి వెళ్లమని సూచించారు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆ ఇంటిని సందర్శించి బాధితులను పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు.


కూలిన ప్రహరీ గోడను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉరుకూటి చందు, తదితరులు

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

పెదగంట్యాడ : ప్రజలపై విద్యుత్ చార్జీల పేరుతో ఆర్థిక భారం పెంచేందుకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అందరూ వ్యతిరేకించాలని సీపీఎం గాజువాక జోన్ కమిటీ సభ్యుడు ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు కలిగే నష్టాలపై జీవీఎంసీ 76వ వార్డు పరిధి ఎస్టీ కాలనీలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాప కింద నీరులా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రజలంతా వాటిని అడ్డుకోవాలని కోరారు. ఇప్పటికే సర్ చార్జీలు, కస్టమ్ చార్జీలు, ట్రూ ఆప్ చార్జీలతో ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. ఈ స్మార్ట్ మీటర్లతో మరింత భారం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, బంగారు నాయుడు, రమణ, లక్ష్మి, శ్రీదేవి, రాము తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

మహిళా సాధికారతే లక్ష్యం

పెదగంట్యాడ : మహిళల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వనజాక్షి అన్నారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం సీపీఐ పని చేస్తోందన్నారు. అనంతరం లంబోధర స్త్రీశక్తి టిడ్కో అభివృద్ధి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షురాలిగా కె.రమణి, ఉపాధ్యక్షులుగా ప్రమీల, వనజాక్షి, కార్యదర్శిగా పీత లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా జయలక్ష్మి, ఉమాదేవి, కోశాధికారిగా సింగిరెడ్డి లక్ష్మిని ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వనజాక్షి

అండర్‌పాస్ వంతెన విస్తరించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు

అగనంపూడి : అగనంపూడి నిర్వాసిత కాలనీలు, జేఎన్ఎన్‌యూఆర్ఎం, హడ్కో ఇళ్ల సముదాయాలు, మంగళపాలెం, దువ్వాడను అనుసంధానించే మార్గంలోని మూడడుగుల అండర్ పాస్ వంతెనను విస్తరించాలని, కూర్మన్నపాలెం వరకు మాత్రమే ప్రతిపాదించిన మెట్రోలైన్‌ను లంకెలపాలెం వరకు పొడిగించాలని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కోరారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వార్డులోని సమస్యలు వివరించారు. అగనంపూడి హనుమాన్ కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ వరకు విద్యుద్దీకరణ చేపట్టాలని కోరారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.చందు, పి.అచ్యుత్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసుల సోదాలు


రౌడీషీటర్ ఇంట్లో సోదాలు చేస్తున్న గాజువాక పోలీసులు


రౌడీషీటర్ ఇంట్లో సోదాలు చేస్తున్న న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ : గాజువాక మండలంతోపాటు పెదగంట్యాడ మండలంలోని రౌడీషీటర్ల ఇళ్లలో గాజువాక పోలీసులు, న్యూపోర్టు పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక సీఐ పార్థసారథి, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వన్‌టౌన్ ప్రాంతంలో జరిగిన నాటు తుపాకీతో కాల్పుల ఘటన నేపథ్యంలో ఈ సోదాలు నిర్వహించామన్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో 31 మంది, న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో 24 మంది రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్స్, షీట్ హోల్డర్స్ ఇళ్లలో సోదాలు నిర్వహించామని, వారి వద్ద ప్రమాదకరమైన, హానికరమైన వస్తువులు లభించలేదని సీఐలు స్పష్టం చేశారు.

మాజీ సీఎం జగన్ దృష్టికి స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు

పెదగంట్యాడ : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి స్టీల్‌ప్లాంట్ సమస్యను తీసుకెళ్లాలని స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చూడాలన్నారు. స్పందించిన దేవన్‌రెడ్డి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.


తిప్పల దేవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సభ్యులు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

పెదగంట్యాడ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు మహ్మద్ సిద్ధిఖ్, శ్రీశైలపు శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, పల్లా చినతల్లి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, రావాడ శివ, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టారెడ్డి, కాకినాడ పెంటారావు, ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.


ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న నాయకులు

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు బీసీ కాలనీ వార్డు సచివాలయం నూతన సిబ్బందిని స్థానిక ప్రజా సంఘాల నాయకులు మంగళవారం సత్కరించారు. ఇటీవల ఇక్కడికి బదిలీపై వచ్చిన వార్డు సచివాలయ కార్యదర్శులను సత్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి వెంకటేశ్వరరావు, తలారి శ్రీనివాసరావు, కొరాయి జగదీష్, తిర్రి సత్యనారాయణ, వి.గీతా అన్నపూర్ణ, కరణం అప్పారావు, పూడి యుగంధర్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వార్డు సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

అనాథలకు అన్నదానం

అగనంపూడి : బొర్రమాంబ పారాయణ సేవా సమితి అగనంపూడి సత్రం కూడలిలో అన్నదానం చేశారు. పారాయణ కమిటీ సభ్యురాలు కరణం అర్జునమ్మ మనుమడు దాసరి గుహన్ జన్మదినోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు.


అన్నదానం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

ఓల్డ్ ఈజ్ గోల్డ్

చెక్కగానుగ నూనెలు

వేరుశనగ నూనె మంచిదని ఒకరు. ఆలివ్ నూనైతే భేష్ అని ఇంకొకరు. రిఫైన్డ్.. డబుల్ రిఫైన్డ్ అయితే ఇంకా బెస్ట్ అని మరి కొందరు.. ఒక్కొక్కరిది ఒక్కో మాట. అయితే అంతా చెప్పే ఒకే మాట చెక్కగానుగ నూనెకు మించినది లేదని. మన పూర్వీకులంతా ఆ నూనెలే వినియోగించారు. రసాయనాలతో కూడిన నూనెలు రాజ్యమేలుతున్న తరుణంలో ఆరోగ్యాభిలాషులు మళ్లీ చెక్కగానుగ నూనె(కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్)కు మొగ్గు చూపుతున్నారు. అందుకు నిదర్శనమే ఇప్పుడు పలు చోట్ల ఏర్పాటవుతున్న చెక్కగానుగ మిల్లులు.

- చెక్కగానుగల ఏర్పాటుకు వ్యాపారుల ఆసక్తి
- వీటి ద్వారా తీస్తున్న నూనెలకు ఆదరణ
- ఆరోగ్యం, నమ్మకమే కారణం

కళ్లముందే నూనె తీస్తూ..

ప్రజల అభిరుచిని గమనించిన వ్యాపారులు కూర్మన్నపాలెం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో పలుచోట్ల చెక్కగానుగల్ని స్థాపిస్తున్నారు. అయితే అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అవే పరికరాలను అటుఇటుగా స్వల్ప మార్పులు చేసి, ఎలక్ట్రిక్ మోటార్లు అమర్చుతున్నారు. దీంతో అప్పటి కష్టం లేకపోయినా స్వచ్ఛమైన నూనెలు, పిండిలు ప్రజలకు అందిస్తూ పూర్వ సాంప్రదాయాన్ని ఇప్పటితరం వారికి గుర్తుచేస్తున్నారు. ప్రజల కళ్లముందే నూనెల్ని ఆడించి ఇస్తుండడంతో ప్రజలు పోటీపడి మరీ కొంటున్నారు. చెక్కగానుగ నూనెలు ఆరోగ్యానికి మంచిదని కాస్త ధర ఎక్కువైనా చాలామంది వాటి వినియోగానికి ఆసక్తి చూపుతున్నారు.


నూనెలకు అవసరమైన ముడి సరకు కొబ్బరి చెక్కల్ని ఎండబెట్టిన దుకాణదారు

కూర్మన్నపాలెం: కొత్తొక వింత.. పాతొక రోత అనే నానుడి అన్నింటా సరికాదేమో..! ప్రస్తుతం నూనెల వినియోగంలో ఓల్డ్ ఈజ్ గోల్డ్. మన పూర్వీకులు వాడిన పరికరాలే కాస్త తీరు మార్చుకుని జనబాహుళ్యంలోకి వస్తున్నాయి. ఒకప్పుడు పశువుల సాయంతో రకరకాల నూనెలు, ఇతర పిండిలు ఆడించే గానుగలు ఇప్పుడు సైజ్‌లో కొంత తగ్గి, విద్యుత్ మోటార్ల సాయంతో వేగం పెరిగి, పూర్వపు **నాణ్యతతో నూనెల్ని అందిస్తున్నాయి. ఆ నూనెల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య** ప్రయోజనాల కారణంగా రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. అందుకే గాజువాకతోపాటు, కూర్మన్నపాలెం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో చెక్కగానుగల ఏర్పాటు పెరిగింది.

పెట్టుబడి ఎక్కువే!

ఈ తరహా చెక్క గానుగల ఏర్పాటుకు దాదాపు రూ.40 లక్షలు వరకు వెచ్చించాలని నిర్వాహకులు చెప్తున్నారు. తమకున్న స్థల విస్తీర్ణం బట్టి మిషన్లు ఆర్డరిస్తే తయారీదారులు పరికరాలను రూపొందించి, అమరుస్తారు. నూనెలు ఆడేటప్పుడు, పిండి దంచేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే చేతులు గానుగలో పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ముడిసరకు రాక.. నూనె దిగుబడి

నూనెలు ఆడేందుకు ముడిసరకులు ప్రధానంగా నువ్వులు శ్రీకాకుళం, తుని నుంచి, వేరుశనగ పలుకులు విజయనగరం, కొబ్బరి చిప్పలు అంబాజీపేట తోపాటు, జిల్లాలోని పలు దేవా**లయా**ల నుంచి తెప్పిస్తున్నారు. 10 **కిలోల** నువ్వులు గానుగలో వేస్తే 5 కిలోల **వరకు** నూనె వస్తుంది. అందుకే నువ్వుల **నూనె రూ.4**20 వరకు అమ్ముతున్నారు. ఆవాలు **అయితే 10 కి**లోలకు రెండు కిలోలు, కొబ్బరి 10 **కిలోలకు 5** కిలోలు, వేరుశనగ 10 కిలోలకు 4 కిలోల నూనె దిగుబడి వస్తుంది.



అమ్మకానికి సిద్ధంగా చెక్కగానుగ నూనెలు

వ్యాపారంగా మారింది


చెక్క గానుగల్ని మా పూర్వీకులు ఎద్దులతో నడిపేవారు. అప్పట్లో అంతా ఆ నూనెలే వాడేవారు. ఇప్పుడలా కాదు. అందుకే కులవృత్తుల వారితో సంబంధం లేకుండా అంతా ఈ వ్యాపారంలోకి వస్తున్నారు. ప్రస్తుతం ప్రజలు కూడా గానుగ నూనె వాడకాన్నే ఇష్టపడుతున్నారు.

– చిత్రాడ గంగరాజు, గానుగల నిర్వాహకుడు

దూరంగా ఉన్నా..


మా కాలనీలకు దూరంగా ఉన్నప్పటికీ గానుగల దగ్గరికే వెళ్లి నూనె కొనుగోలు చేస్తాం. అప్పుడప్పుడూ మేమే నువ్వులు, వేరుశెనగ పలుకులు పట్టుకెళ్లి ఆడిస్తుంటాం. ఒకప్పుడు పల్లెలకే పరిమితమైన గానుగలు పట్టణాల్లో అందుబాటులోకి రావడం మంచి పరిణామం.

– ఎం.మురళీమోహన్, రాసాలమ్మకాలనీ


నువ్వుల నుంచి నూనె తీసే చెక్కగానుగ

ఆరేళ్లుగా చెక్క గానుగలు


ఆరేళ్ల క్రితం చెక్క గానుగలు ఏర్పాటు చేశాను. వ్యాపారం బాగానే సాగుతోంది. ఆరోగ్యానికి మంచిదనే ఉద్దేశంతో ప్రజలు స్వచ్ఛమైన నూనెల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం నువ్వు పిండికి డిమాండ్ ఉంది. రోజుకు 15 కిలోల వరకు అమ్ముతున్నాం.

– బెల్లంకొండ అప్పలరాజు, చెక్క గానుగల నిర్వహకుడు, వడ్లపూడి

గానుగ నూనెతో ఆరోగ్యం


నిర్వాసిత కాలనీల్లో పూర్వపు పద్ధతిలో చెక్క గానుగలు ఏర్పాటుకావడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి తరం వారికి ఈ విధానం గురించి పెద్దగా తెలియదు. చెక్కగానుగలతో ఆడిన నూనెలు వాడడం వలన ఎన్నో ప్రయోజనాలున్నాయని నిపుణులు చెప్తున్నారు.

– ఎం.గోవింద్, కణితి


చిమ్మిడి దంచుతున్న చెక్కగానుగ యంత్రం

ఎట్టకేలకు నష్ట పరిహారం చెల్లింపు

అగనంపూడి : విశాఖ ఉక్కు ఉద్యోగి సీతిన అచ్చుతరావు విధి నిర్వాహణలో మృతిచెందగా, కాదని బుకాయించిన యాజమాన్యం జేసీఎల్ ఆదేశాలతో ఎట్టకేలకు నష్ట పరిహారం చెల్లించిందని మృతుని భార్య లక్ష్మి తెలిపారు. 2016లో స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదవశాత్తు అచ్చుతరావు మృతిచెందారు. అయితే ప్రమాదవశాత్తు మరణం కాదని, నష్ట పరిహారం చెల్లించేది లేదని యాజమాన్యం నిరాకరించడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు రాష్ట్ర కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరణ కాలం నుంచి నష్ట పరిహారం చెల్లించాలని జేసీఎల్ ఆదేశించింది. అయినప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు చేయడంతో రామ అప్పారావు మళ్లీ కార్మికశాఖ అధికారులను సంప్రదించడంతో... స్టీల్‌ప్లాంట్ అధికారులు పరిహారం చెల్లించని పక్షంలో 50 శాతం అదనంగా చెల్లించాలని ఆదేశించడంతో యాజమాన్యం ఎట్టకేలకు పట్టువీడి చెల్లింపులు చేసిందని ఆమె పేర్కొన్నారు.



ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ


డాక్టర్ కిరణ్‌కుమార్

పెదగంట్యాడ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ గాజువాక జోన్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షితో మంగళవారం ఆయన మాట్లాడారు. జోన్ పరిధిలోని డ్రైన్లు, కాలువల్లో ప్రవహించే మురుగునీరు సముద్రంలో కలిసిపోయేలా ఔట్ లెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. దీనివల్ల నీరు నిల్వ ఉండదన్నారు. ఇంజినీరింగ్ అధికారుల పాత్ర అవసరం లేనిచోట శివారు ప్రాంతాల్లో తాత్కాలికంగా గోతులు తవ్వి నీరు వెళ్లే విధంగా చూస్తున్నామన్నారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండిపోవడం వల్లే దోమలు అధికమవుతాయని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు కూడా సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. లార్వా ఆపరేషన్ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. గాజువాక జోన్‌లో తొలిసారిగా డ్రోన్ల సాయంతో స్ప్రేయింగ్ చేయిస్తున్నామని, ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలు వార్డుల్లోని చెరువుల్లో డ్రోన్స్ సాయంతో స్ప్రే చేయించామని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామన్నారు. డ్రైన్ డీ సిల్టేషన్ ద్వారా దోమలు లేకుండా, లార్వా అభివృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. డోర్ టు డోర్ సర్వేలెన్స్ ద్వారా లార్వా స్ప్రే చేయిస్తున్నామని, పబ్లిక్ టాయిలెట్ల వద్ద మెస్‌లు కడుతున్నామని, ప్రజలకు కూడా మెస్‌లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పందుల నివారణలో కొంత వరకూ సఫలీకృతమయ్యామని, గతంలో షూటర్ల ద్వారా నివారించేవారిమన్నారు. ప్రస్తుతం పందుల పెంపకందారులకు అవగాహన కల్పించడంతో చాలా వరకూ తగ్గాయని తెలిపారు. చెత్తను తొలగించడానికి వాహనాలు పక్కాగా ఏర్పాటు చేశామని, ఏ రోజుకారోజు తరలిస్తున్నామని తెలిపారు. 115కు పైగా క్లాప్ వాహనాలను ఇందుకోసం ఏర్పాటు చేశామని, వాహనాలు వెళ్లలేని చోటకు సిబ్బంది పుష్ కార్టులతో వెళ్లి చెత్త సేకరిస్తున్నారని తెలిపారు. వార్డుల్లో ఎక్కడా చెత్త ఉండిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



















